# వెలుగు




గుమ్మంలోంచి వస్తున్న వెలుగు కనురెప్పల చుట్టూ తిరుగుతోంది. అయినా కళ్ళు మూసుకోవాలని పించలేదు లలితకి. ఆ వెలుక్కి భయపడి కళ్ళు మూసుకుంటే అంతా మామూలే.

కాస్సేపు మూతలుపడ్డ కనురెప్పల కింద ఆలోచనలు నెమ్మదిగా, వేడిగా, చిరాగ్గా, చీదరగా కదుల్తాయి..... ఇంకాస్సేపటికి వాటికి మత్తొస్తుంది.... నెమ్మదిగా ఆ మత్తు తనని నిద్రలోకి లాక్కెడుతుంది.... ఆ నిద్ర అలాగే అణగతొక్కి లేవనివ్వదు చాలాసేపు.

వెలుగింక ఆరిపోతుందనగా ఏ ఆరున్నరకో మెలుకువొస్తుంది. అప్పుడేం చెయ్యటానికీ తోచదు. అసలే రోజంతా చేయటానికేం పనిలేని మనిషి తాను..... చాలాసేపు పడుకుని సాయంత్రాలు అలా నిద్దరలేస్తే శరీరంతో పాటు మనసు, ఆలోచనా కూడా చచ్చిపోయి నట్టుంటుంది. ప్రపంచంలో జీవమున్న

వస్తువేదీ లేనట్టు.... జీవితం అనవసరం అన్నట్టు.... చాలా అసహ్యంగా ఉంటుంది.... అందుకనే ఈ వెలుగంటే, కనురెప్పలు మూసుకోవటం అంటే.... భయం.

'కళ్లు బాగా తెరవాలి.... తెరిచి వెలుగులోకి చూడాలి'.... లలిత రెండు చేతుల్తో కళ్ళు నులుముకుంది. మంచం మీద పక్కకి తిరిగి పడుకుంది.

'అది కదలదు.... కడుపు నిండిన బతుకు దానిదిప్పుడు. మళ్ళీ రాత్రి పదింటివరకూ... . గోడమీద దీపం చుట్టూ పురుగులు బాగా చేరేవరకూ దానికి ఆకలుండదు....' ఎదురుగా తెల్లటి గోడమీద నల్లటిచుక్కల్తో బల్లి పెద్ద దుంగలా కనబడుతోంది లలితకి.

ఎంతసేపు చూచినా బల్లి కదలటం లేదు. దాని వెన్నుమీది నల్లటి చుక్కల్లోంచి చిరాకు సరఫరా అయింది లలిత చూపుల్లోకి.

'అవును యిందాకా తను అమ్మ మీద అనవసరంగానే చిరాకుపడింది. అన్నయ్య వోపక్కన కంగారు పెడుతూనే వున్నాడు సినిమా మొదలుపెట్టే టైమ్ అయిందని. అంతకుముందే రెండుసార్లు పిలిచింది తనని రమ్మని. తల్లి ప్రాణం కాబట్టి ఉండబట్టలేక వెళ్ళేప్పుడు మూడోసారి మళ్ళీ....

"నువ్వు వొక్కదానివీ ఎందుకే.... యింట్లో రాకూడదూ....." అంది.

"అసలే తలనెప్పితో ఛస్తుంటే ఎందుకు నన్నింకా చంపటం.... నువ్వు వెళ్ళకూడదూ....." అని విసుక్కుంది తను. నిజంగా తలనెప్పి లేదు. తనకప్పుడు సినిమాకి వెళ్ళాలనిలేదు అంతే..... సినిమాకే కాదు. అసలీమధ్య యిల్లుదాటి బైటికే వెళ్ళాలనిపించటంలేదు. బైటికెడితే.... ఆరోజు....

ఆ ముసలాయనకి అరవై పైనే ఉంటుందేమో వయసు.... ఆవిడ..... యిద్దరూ మాట్లాడు కుంటుంటే..... ఆరెండు జతల ముసలి కళ్ళలో ఎంత అభిమానం ఒకళ్ళ మీద యింకొకళ్ళకి....

చిన్నపాపలు ఎంత బావుంటారు. తప్పటడుగులు వేస్తుంటే వాళ్ళ చెయ్యి పట్టుకుని జాగ్రత్తపడటంలో ఏ తల్లికేనా ఎంత ఆనందం.... అలాంటి దృశ్యాలు కనిపించాయి.

ఎందుకో అవేకాదు..... అలా చాలా సహజంగా జరిగేవి, కనిపించేవి చూడాలనిపించటంలేదు. తనకి అసహనం, విసుగు పెరిగిపోతున్నాయి ..... ప్రతిదానిమీద కారణం లేకుండా చిరాకు....

ఈ గుమ్మం వొకటి దరిద్రంగా.... వెలుక్కెదురు. కొంప ములిగినట్టు ఎందుకో యిలా విరుచుకుపడుతోంది గదిలోకి వెలుగు.

ఎన్నిసార్లు ప్రయత్నించినా గుర్తురాదే ఆయన ముఖం..... ఎన్నిసార్లు యిప్పటికి..... కళ్ళముందు కనిపించినట్టే ఉంటుంది..... ముక్కో..... పెదవో..... బుగ్గో..... యిలాగే తప్ప మొత్తం రూపమంతా కళ్ళముందు ఏనాడూ కనిపించదు. తన ప్రయత్నమంతా ఈ వెలుగులోనే కరిగిపోతోంది. పెళ్ళయి కాపరానికి వెళ్లింతర్వాత ఆయనతో కలిసి గడిపిందెన్నాళ్ళు..... సరిగ్గా మూణ్ణెల్లు. అప్పటికింకా కొత్తే. ఒకళ్ళనొకళ్ళు తెలుసుకుంటుండగా..... పోల్చుకుంటుండగానే తన అదృష్టం చెరిగిపోయింది. ఆయన యింకా కొన్నాళ్ళు బతికుంటే..... యింకా కొన్నాళ్ళు కాపరం చేసుంటే..... ఇలా విరుచుకుపడే వెలుగులో కూడా ఆయన ముఖం కనబడేదేమో.....

అయిదయిందన్నమాట...... ఈసైరన్ కూతొకటి...... మహా దారుణంగా ఉంటుంది..... ఎవడో రాక్షసుడు అరిచినట్టు..... ఏమో తనకి మాత్రమే అలా అనిపిస్తుందేమో...... ఆ మిల్లులో పనిచేసే వాళ్ళు ఆ కూతకోసం ఎంతగా ఎదురు చూస్తుంటారో....

రెండేళ్ళ క్రితం మావయ్యా, తను రిక్షా దిగుతుండగా యిలానే వినిపించింది సైరనుమోత..... ఎదురొచ్చిన అమ్మ తనని ఎగాదిగా చూసి బావురుమంది..... కౌగలించుకునేడ్చింది. వచ్చిన మామయ్య ముందుగదిలోనే కూర్చుండిపోయినట్టున్నాడు. అన్నయ్య ఇంట్లో లేడు. లోపలి నుంచొచ్చిన వదిన బలవంతంగా అమ్మ దగ్గర నుంచి తనని వేరుచేసి గదిలోకి తీసికెళ్ళింది. వదిన కళ్ళల్లోనూ నిండుగా నీళ్ళున్నాయి. ఎందుకో తనకే అంతగా ఏడుపు రాలేదప్పుడు. పెళ్ళయిన మూణ్ణెలకే మొగుడు పోవటమంటే తను బతుకులో ఎంతగా నష్టపోయిందో తెలుసు. అయినా అప్పుడు ఏడుపు రాలేదు..... ఏదో బెరుకు..... భయం తప్ప....

అన్నయ్య ఆ రాత్రి చాలా పొద్దు పోయాక్కాని ఇంటికి రాలేదు. ఆ మర్నాడు అంతే..... మూడోరోజు కానీ తన కళ్ళ ముందు పళ్ళేదు. అన్నయ్య కళ్ళల్లో తను మొదటిసారిగా నీళ్ళు చూసిందప్పుడే.

వారం గడిచింతర్వాత అనుకుంటా.... వదిన అలా అన్నయ్యతో అంటుంటే వింది తను.... "కాలేజీలు తెరుస్తున్నారు.... లలితని చేర్పించకూడదూ....." అని, తిట్టాడు వదినని అన్నయ్య.... "అసలే బాగా దెబ్బతినుంది దాని మనసు.... ఇంక దానికే చదువూ వొద్దు.... నేనున్నంతకాలం దానికేం లోటూ రానివ్వను...." అన్నాడు.

నిజంగా అన్నయ్య యేం లోటూ రానివ్వలేదు...... అమ్మా ఏ పనీ చెయ్యనివ్వదు. కాని ఎన్నాళ్ళు తనిలా.....

ఏడాదిక్రితం అమ్మ చాటుగా ప్రయత్నించిన ఆ రెండో పెళ్ళి సంబంధం కుదిరుంటే ఈపాటికి తన బతుకెలా ఉండేదో.... కాని కుదరలేదు. చూపుల వరకూ కూడా రాలేదు. అమ్మ తనకి తెలియదనుకుంటుంది ఆ సంగతి. అదేకాదు యికముందేనా ఏ సంబంధమేనా కుదిరితే తనకి, ఏదో కాంట్రాక్ట్‌లాగే కుదురుతుంది.... యింతమంది పిల్లల్ని చూడాలి.... ఇంత కట్నం.....

ఛ..... ఏమిటీ ఆలోచన్లు..... మాట్నీ వదిలే టైమవుతోంది.... ఇంక వాళ్ళొస్తారు లేవాలి. కళ్ళు తెరిచింది లలిత.

'ఏమిటింత చీకటి.... బెడ్‌లైట్ ఏమైంది.... టైమెంత అయిందో.... పన్నెండవుతుందేమో.... ఏమిటి వీపు మీద పాకుతోంది.... వేళ్ళు.... ఎవరు ఎవరై ఉంటారు.... రవా..... రవే అయుంటాడు..... రవి కాకపోతే యింకెవరున్నారు.... ఏం చెయ్యాలి.... ఏమిటి ఈ ఒక్కక్షణంలో తన వొళ్ళు తనకే యింత వేడిగా ఉందేమిటి.... లేవాలి.... లెమ్మనాలి....

"రవీ.... రవీ...."

'పలకడేం..... భయపడుతున్నాడా'

"లే.... నిన్నే.... లేచి వెళ్ళి పడుకో.... తప్పు....." అంది నెమ్మదిగా. గబుక్కుని లేచాడు రవి. అంత చీకట్లోనూ రవి హాలులోకి వెళ్ళిపోవటం కనిపించింది లలితకి. లేచి లైటు, తలుపు వేసొచ్చి పడుకుంది. ఇందాకటి వరకు రవి పడుకున్న చోటు వెచ్చగా ఉంది. లైటు వెలుగు సూటిగా కళ్ళల్లోకి పడుతోంది. గోడమీద ఒక్కొక్క పురుగే చేరుతోంది లైటుచుట్టూ.... రవి గుర్తొస్తున్నాడు లలితకి. నాలుగు నెలల క్రితం వరకూ పక్కింట్లో రోజూ కనిపించేవాడు. వాళ్ళ నాన్నగారికి ట్రాన్సఫర్ అయి వెళ్ళటం వల్ల స్కూల్లో సర్టిఫికెట్లు తీసుకోటానికి వచ్చాడు. లేకపోతే మళ్ళీ కనిపించేవాడే కాదేమో....

'రవికి అప్పుడే అంత వయస్సు వచ్చిందా.... బయట ఏం చేస్తున్నాడో యిప్పుడు? తెల్లారితే ఏం

గొడవ జరుగుతుందో అని భయపడుతూ పడుకుని ఉండి ఉంటాడు. కాని ఆ ఒక్కక్షణంలోనే తనవొళ్ళు అంత వేడిగా....'

లలిత కావాలనే లైటు వేపు చూసింది. అంతవరకూ ఏమూలుందో మరి పాకుతూ వచ్చింది బల్లి.

చూస్తోంది లలిత.... నెమ్మదిగా బల్లి పాకటం.... అందంగా నోరు తెరవటం.... పురుగుని పట్టుకోవటం అన్నీ కనిపిస్తున్నాయి.

బల్లి ఎలా మింగుతుందో తను అలాగే ఈ కోరికని మింగెయ్యగలిగితే.

అది పురుగుల్ని కాదు మింగుతోంది - తన ఆకల్ని.... ఆకలి తప్పు కాదు.... నిద్దరా తప్పుకాదు.... రవిదీ తప్పుకాదు.... మరి.... కోరికని మింగలేని తనదే తప్పు.... ఆ కోరిక పురుగులా చచ్చిపోయేది కాదు మింగటానికి అందుకే తనకీ చిరాకు.... విసుగు.... కొన్నాళ్ళు యిలాగే తను ఈ చీకటిలో గడిపితే ఏ వ్యాపకం లేకుండా..... తనని ఆ కోరిక తినేస్తుందేమో.... ఏదన్నా, ఎవరన్నా అసహ్యం పుడుతుందేమో....

తెల్లారిం తర్వాత చాలాసేపటి వరకూ యింట్లో ఎవరికీ లలిత గుర్తురాలేదు. గుర్తొచ్చాక అందరూ కంగారుపడ్డారు.... అందరికన్నా ఎక్కువ కంగారుపడింది రవే... లలిత రాసిపెట్టిన ఉత్తరం ముందు దొరికిందీ రవికే....

'అమ్మకి, నేను హైద్రాబాదు బాబయ్య దగ్గరికి వెడుతున్నాను. కంగారుపడకు. నీతో చెప్పే వెళ్ళాలనుకున్నాను. కాని నానా గొడవా అయితేనే తప్ప వొప్పుకోనని యిలా చేశాను. ఏదేనా ఉద్యోగం కోసం ప్రయత్నం చెయ్యాలని ఉంది. అన్నయ్య పోషించలేడని కాదు. నా బతుకు నేను తీర్చిదిద్దుకోటానికి..... అక్కడికి చేరాక ఉత్తరం రాస్తాను.

- లలిత.

• స్వాతి మాసపత్రిక, ఆగస్టు 1971